ఎవరి ధీమా వారిదే

ముగిసిన ప్రచార పర్వం ● హోరా హోరీగా ప్రధాన పార్టీల ప్రచారం

అంబర్‌పేట: ప్రచార పర్వం ముగిసింది. గత నెల రోజులుగా హోరెత్తిన ఎన్నికల ప్రచార పర్వానికి మంగళవారం తెరపడింది. అంబర్‌పేట నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలు నువ్వా, నేనా అనే స్థాయిలో ప్రచారాన్ని కొనసాగించాయి. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డాయి. నియోజకవర్గాన్ని చుట్టేసి ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు విశ్వ ప్రయత్నం చేశారు. ప్రచార పర్వం ముగియడంతో ఇక ఎన్నికల తాయిలాలకు అభ్యర్థులు సిద్ధపడుతున్నారు.

గెలుపుపై బీఆర్‌ఎస్ ధీమా..

బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ గెలుపుపై ధీమాగా ఉన్నారు. పార్టీ టికెట్ ముందే ప్రకటించడంతో ప్రచారానికి కావాల్సినంత సమయం దొరకడం కలిసివచ్చే అంశం. తిరిగి ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు రెట్టింపు అవుతాయని హామీ ఇస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. సొంత పార్టీలో స్వల్ప అసంతృప్తి మినహా బీఆర్‌ఎస్ పార్టీకి తిరుగులేదనే ధీమాలో అభ్యర్థితో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి. ఫైనల్‌గా కేటీఆర్ రోడ్‌షోకు విశేష స్పందన లభించడంలో గెలుపుపై ధీమాగా ఉన్నారు.

విజయానికి ఆరు గ్యారంటీలు:

కాంగ్రెస్ మేనిఫెస్టో, ప్రభుత్వ వ్యతిరేకతే తమను విజయ తీరాలకు చేరుస్తుందని ఆ పార్టీ అభ్యర్థి రోహిణ్ రెడ్డి ధీమాగా ఉన్నారు. ప్రచారం ప్రారంభించిన తక్కువ సమయంలోనే నియోజకవర్గ నాయకులు, పార్టీ శ్రేణుల నుంచి అనూహ్య మద్దతు రావడంతో ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతుందనే అంశం కూడా తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. కొత్త వ్యక్తిని సహితం నియోజవర్గం ప్రజలు ఆదరిస్తారని ధీమాగా ఉన్నారు. పార్టీ శ్రేణుల సమన్వయమే కలవర పెట్టే అంశం.

పార్టీ బలంపైనే బీజేపీ నమ్మకం:

బీజేపీకి అంబర్‌పేట నియోజకవర్గం కంచుకోట అని అదే తమను గెలిపిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి సి.కృష్ణయాదవ్ ధీమాగా ఉన్నారు. బీజేపీ తరుపున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా తదితర మహామహులు ప్రచారానికి రావడం కలిసి వస్తుందని భావిస్తున్నారు. అంతే కాకుండా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో గెలుపు సులువు అనుకుంటున్నారు.

అంజన్‌కు కులసంఘాల మద్దతు



మాట్లాడుతున్న అరుణా జయేందర్, యాదగిరిగౌడ్ తదితరులు

చిక్కడపల్లి: ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌కు పలు కులసంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. చేయి గుర్తుపై ఓటు వేసి అంజన్‌ను గెలిపించాలని ఆయా సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం జవహర్‌నగర్ ఎస్సార్టీ క్వార్టర్స్‌లో గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్ జి.అరుణాజయేందర్ గంగపుత్రులు ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో అంజన్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తారని ఆయన మంత్రిగా ప్రమాణం చేస్తే ముషీరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. బంటారం యాదగిరిగౌడ్ మాట్లాడుతూ గౌడ కులానికి చెందిన ప్రజలు అంజన్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఆర్‌కె శ్రీనివాస్ ముదిరాజ్, వి.శివకుమార్ మాట్లాడుతూ ముదిరాజ్, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో శంకర్‌గౌడ్, జె.సురేష్, బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి కింగ్‌కోఠి సహకారంతో మంగళవారం సుందరయ్య పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బీపీ, షుగర్‌తో పాటు ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. దాదాపు 300 మంది వాకర్స్ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సునీల్, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఏ.కిషన్‌రావు, వాకర్స్ మాజీ అధ్యక్షులు వి.నాగభూషణం, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారానికి మంగళవారం తెరపడటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, నగదు పంపిణీ చేసే అవకాశం ఉండటంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రంగంలోకి దిగారు. మంగళవారం ఉదయం నుంచే వేర్వేరుచోట్ల వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. భారీగా మద్యం పంపిణీ జరగనుందని సమాచారం రావడంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. పలుచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గల్లీలు, అపార్ట్‌మెంట్ల వద్ద తిష్టవేసి నగదు పంపిణీని అరికట్టేందుకు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే రెండోసారి తనను గెలిపిస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ స్టేడియం నుంచి నిర్వహించిన బైక్‌ర్యాలీకి విశేష స్పందన లభించింది. వేలాది మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. టీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహా ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ హయాంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదన్నారు. రూ. కోట్లు వెచ్చించి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ముషీరాబాద్‌లో ప్రజల కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్, రాకేష్‌కుమార్, వై.శ్రీనివాస్‌రావు, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ మోజేస్, నర్సింగ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శులు ఎస్.డి సాయికృష్ణ, శంకర్‌గౌడ్, నాయకులు కాటారం దినేష్, కల్వగోపి, ఆర్ రాంచందర్, ముదిగొండ మురళి, గోకా నవీన్, జునైద్‌బాగ్‌దాదీ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ఆర్ రాజేష్, మాధవి, సుశీల, ముచ్చకుర్తి ప్రభాకర్, సుధాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో యువతికి వేధింపులు

సైబర్ క్రైం పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా వేదికగా ఓ యువతిని వేధిస్తున్న వ్యక్తిపై నగర సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. సైబర్ క్రైం ఏసీపీ శివ మారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ యువతికి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ఓ వ్యక్తి పరిచయం అయ్యాండు. యువతి ఫొటోలను అసభ్యకరంగా సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. తాను చెప్పినట్లు వినకపోతే ఆ ఫొటోలను వివిధ సోషల్ మీడియా వేదికల్లో పెట్టి వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

హిమాయత్‌నగర్: సోషల్ మీడియాలో ఫొటోలు పెడతానంటూ ఓ యువతిని వేధిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సైబర్‌క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు. ఓ యువతి తన ఫొటోలను అసభ్యకరంగా మార్చి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తానంటూ వేధిస్తున్న వ్యక్తిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, మెదక్ జిల్లా జహీరాబాద్‌కి చెందిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని ఏసీపీ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల తెలంగాణ

అంబర్‌పేట్ కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి



నల్లకుంటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి

నల్లకుంట: దొరల తెలంగాణపోయి ప్రజల తెలంగాణ రావాలంటే కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యుడు వీ. హనుమంత రావుతో కలిసి ఆయన నల్లకుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి హస్తం గుర్తుపై ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రోహిణ్ రెడ్డి తండ్రి డాక్టర్ ముత్యం రెడ్డి, డివిజన్ మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవి రమేష్, పార్టీ సీనియర్ నాయకులు రమేష్, కె. గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌తో మహేష్ అగర్వాల్

కాచిగూడ: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గో సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడంతో మంగళవారం గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సునీల్ బన్సల్‌ను కలిసి అభినందించారు. ప్రతి రైతుకు ఒక గోవును ఇచ్చేందుకు బీజేపీ కృషి చేయాలన్నారు. పార్లమెంట్‌లో గో సంరక్షణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. బీజేపీ నేతలు విజయ్ సురనా, ముఖేష్ చౌహాన్ పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



మహాపాదయాత్రలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్



మహా పాదయాత్రలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

అంబర్‌పేట: అంబర్‌పేటలో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేష్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎన్నికల ప్రచారం చివరి రోజు పార్టీ శ్రేణులతో కలిసి మహాపాదయాత్ర చేపట్టారు. కాచిగూడ నింబోలి అడ్డ నుంచి నల్లకుంట మీదుగా బాగ్ అంబర్‌పేట, అంబర్‌పేట, గోల్నాక వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. ఐదేళ్లగా అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని మరో అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే సంక్షేమ పథకాలు రెట్టింపు అవుతాయన్నారు. ఇప్పటికే నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. తను నిత్యం ప్రజల్లో ఉంటూ సేవలు అందించానని, తిరిగి ప్రజలు తననే గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

కాచిగూడ: బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్, లింగంపల్లి, కాచిగూడ స్టేషన్ రోడ్డు, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కేసీఆర్ నేతృత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అసరా పింఛన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ, రైతు బంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్, రైతు పెట్టుబడి సాయం వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కేసీఆర్ సారథ్యంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మీ పథకం కింద మహిళలకు రూ. 3 వేలు, రూ.5లక్షల కేసీఆర్ బీమా, గృహలక్ష్మీ పథకం కింద అర్హులకు ఇళ్లు అందజేస్తామని తెలిపారు. అత్యధిక మెజారిటీతో తనను రెండోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష, ఓంప్రకాష్ యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, పెంట రమేష్, సునీల్ బిడ్లాన్, రాజేష్, మహేష్, బాబు, మహేందర్ నాయి. తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో భారీ ర్యాలీ

నల్లకుంట: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన మంగళవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ నల్లకుంట డివిజన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సత్యానగర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా, తిలక్ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి, తిలక్‌నగర్ చౌరస్తా, శివం రోడ్డు మీదుగా బాగ్ అంబర్‌పేట వరకు సాగింది. కార్యక్రమంలో బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వనం రమేష్, పద్మావతి డీపీ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకులు గోనే ప్రదీప్ రావు, ఎం. భూపతినాథ్, రమణానాయుడు, బిల్డర్ ప్రవీణ్, నవీన్, భాస్కర్ గౌడ్, బి. ధన్‌రాజ్ యాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్



ర్యాలీలో పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్

చిక్కడపల్లి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలో ఎన్నికల ప్రచార ర్యాలీని నిర్వహించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్, అశోక్‌నగర్, ఇందిరాపార్కు మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన తర్వాత ముషీరాబాద్‌లో నిజమైన అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ముషీరాబాద్‌లో తనను గెలిపిస్తే ప్రజలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని తెలిపారు. రాత్రి పగలు లేకుండా ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అరుణాజయేందర్‌బాబు, శ్రీనివాస్‌ముదిరాజ్, యాదగిరిగౌడ్, శశికుమార్, శంకర్‌గౌడ్, నల్లవెల్లి అంజిరెడ్డి , వై.సంజీవరెడ్డి, మేడి సురేష్, సురేష్‌యాదవ్, రావి వెంకట్‌రెడ్డి, ఆంజియాదవ్, వీడీ కృష్ణ, వాజీద్‌హుస్సేన్, గుర్రం శంకర్, చంద్రకళ, ఎంబి కృష్ణయాదవ్, టీజేఎస్ నేతలు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



రిటర్నింగ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జి.శ్రీనునాయుడు

ముషీరాబాద్: ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ముషీరాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణను సామాజికవేత్త జి.శ్రీనునాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక లైట్లు, ఫ్యాన్‌లు, వీల్ చైర్స్ తదితరులు సౌకర్యాలు కల్పించాలన్నారు.

సీపీఎం నేతల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, అభ్యర్థి దశరథ్ తదితరులు

ముషీరాబాద్: సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దశరథ్ గెలుపును కాంక్షిస్తూ ముషీరాబాద్ నియోజకవర్గంలోని దోమలగూడ చౌరస్తా నుంచి అన్నా నగర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే అసెంబ్లీలో సైతం పేద ప్రజల పక్షాన పోరాడుతారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేలంగి నటన అద్వితీయం



రేలంగి కుటుంబసభ్యులను సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి: ప్రముఖ హాస్య నటుడు రేలంగి నటన అద్వితీయమని ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు అన్నారు. మంగళవారం రాత్రి రేలంగి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నిర్వహించిన రేలంగి వెంకట్రామయ్య సంస్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ప్రముఖులు ఎస్.చంద్రశేఖర్ , టి.రామ సత్యనారాయణ, శంకరనారాయణ, వంశీ రామరాజు, దైవజ్ఞశర్మ, ఆర్.ఎ.నారాయణరావు, రాజ్యలక్ష్మి, రామారావు, రేలంగి కుటుంబసభ్యులు పాల్గొని రేలంగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రేలంగి కుటుంబ సభ్యులను సన్మానించారు.

కాంగ్రెస్‌కు మద్దతు కోసం...

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం మద్దతు కోసం కర్ణాటక మంత్రి రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి రంగంలో దిగారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డిలో నివాసంలో వివిధ రెడ్డి సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. సంఘాల ప్రతినిధులు తీగల మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, పాండురంగారెడి, ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

హిమాయత్‌నగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నగరంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షోతో బీజేపీ నేతల్లో సరికొత్త ఉత్సాహం నింపారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ మంగళవారం తెలిపారు. రోడ్ షోలో భాగంగా కాచిగూడ సిగ్నల్స్ వద్ద వీర్ సావర్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మోదీ నగర పార్టీ నేతలను కలవడం ఆనందంగా ఉందన్నారు. మోదీ పర్యటనతో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిని కలిసే అవకాశం కల్పించిన పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో బీజేపీ విజయం తథ్యం

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణలో బీజేపీ విజయం తథ్యమని జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో రోడ్‌షో, బైక్‌ర్యాలీని నిర్వహించారు. వందలాది బైక్‌లతో కార్యకర్తలు ఉత్సాహంతో ర్యాలీలో పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. అరాచకపాలనకు చమరగీతం జరగాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, ఆలపాటి లక్ష్మీనారాయణ, బంగారు ప్రశాంత్, ప్రేమ్‌కుమార్, బాలకృష్ణ మోహన్, అట్లూరి రామకృష్ణ, శ్రీనివాసగౌడ్, మహిళా నేతలు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం

ఆఖరి రోజు అట్టహాసంగా ప్రధాన పార్టీల ప్రచారాలు

- బీఆర్‌ఎస్, బీజేపీ బైక్ ర్యాలీలు.
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర

ముషీరాబాద్: ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రం తెరపడింది. చివరి రోజు ఆయా పార్టీలు బైక్ ర్యాలీలు, మహాపాదయాత్రలతో నియోజకవర్గాన్ని హోరెత్తించాయి. ఈ కార్యక్రమాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్, బీజేపీ అభ్యర్థి పూస రాజుతో పాటు వారి మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీ...

బీఆర్‌ఎస్ ముషీరాబాద్ అభ్యర్థి ముఠా గోపాల్ విజయాన్ని కాంక్షిస్తూ నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ముఠా గోపాల్, ముఠా జైసింహ, సంగిశెట్టి జగదీశ్, ఆయా డివిజన్‌ల అధ్యక్షులు, ఎన్నికల ఇన్‌చార్జీలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఆశోక్‌నగర్ చౌరస్తా, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అడిక్‌మెట్, రాంనగర్ చౌరస్తా, ముషీరాబాద్, చేపల మార్కెట్, సాగర్‌లాల్ ఆసుపత్రి, భోలక్‌పూర్, రంగానగర్, గాంధీనగర్, ఎల్‌ఐసీ బ్రిడ్జి, కవాడిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీ కొనసాగింది.

విజయం నాదే: ముఠా గోపాల్

నెల రోజులుగా ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగ్‌లు, కేటీఆర్ రోడ్ షోలతో ప్రజలను కలిశామని వారి నుంచి విశేష స్పందన లభించిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ తెలిపారు. ఐదేళ్లుగా తాను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు గత పదేళ్లల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ మహా పాదయాత్ర...

కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌కు మద్దతుగా చిక్కడపల్లి మెట్రో స్టేషన్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ గోల్కొండ చౌరస్తా, ముషీరాబాద్ చౌరస్తా, భోలక్‌పూర్, ప్రాగా టూల్స్, కల్పన థియేటర్ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని వైస్రాయి హోటల్ వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో అంజన్‌తో పాటు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, అరవింద్‌కుమార్, ఎం.నర్సయ్య, వాజిద్ హుస్సేన్, ఆర్.కల్పనా యాదవ్‌లతో పాటు పలువురు సీనియర్‌నాయకులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

గెలుపు తథ్యం: అంజన్‌కుమార్‌యాదవ్

ఎన్నికల్లో తన గెలుపు తథ్యమని అంజన్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఎంపీగా తన హయాంలో చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ అనుకూల పవనాలు, ప్రభుత్వ వ్యతిరేకత, క్రిస్టియన్, ముస్లీం, మైనార్టీల ఓట్లుతో తాను గట్టెక్కుతానని తెలిపారు. మార్పు కోసం తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బీజేపీ బైక్ ర్యాలీ...

బీజేపీ అభ్యర్థి పూస రాజు విజయాన్ని కాంక్షిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అడిక్‌మెట్ డివిజన్ లలితానగర్ కమ్యూనిటీ హాల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రాంనగర్ గుండూ, రాంనగర్ చౌరస్తా, బాగ్‌లింగంపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, చిక్కడపల్లి, దోమలగూడ, కవాడిగూడ, గాంధీనగర్, భోలక్‌పూర్ మీదుగా ముషీరాబాద్ చేరుకుంది. పార్టీ అభ్యర్థి పూస రాజు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, అసెంబ్లీ కన్వీనర్, కోకన్వీనర్, పార్టీ ఇన్‌చార్జీలు ర్యాలీలో పాల్గొన్నారు.

నా గెలుపును ఆపలేరు: పూస రాజు.

ముషీరాబాద్‌లో తన గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ అభ్యర్థి పూస రాజు అన్నారు. బీసీ నినాదం, ఎస్సీ వర్గీకరణ పట్ల సానుకూలత, స్థానికత, గంగపుత్ర కమ్యూనిటీతో పాటు బలమైన బీజేపీ కేడర్, డాక్టర్ కె.లక్ష్మణ్ మద్దతుతో తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి పూస రాజు



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

దేవునిపై ఒట్టు..

నన్ను గెలిపిస్తే ఆరు గ్యారంటీల అమలు

- ఆహోబిల మఠంలో రోహిణ్ రెడ్డి ప్రమాణం
- ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ ఓటర్లకు వినతి
- కాంగ్రెస్‌కు మద్దతుగా బండ్ల గణేష్ ప్రచారం

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసే బాధ్యత తనది అని అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సి.రోహిణ్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని మంగళవారం డీడీ కాలనీలోని ఆహోబిలం మఠంలో ఆయన బాండ్ పేపర్ రాసి దైవ సాక్షిగా ప్రమాణం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చొరవ తీసుకుంటానన్నారు. అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా నుంచి నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి, తిలక్ నగర్, బాగ్ అంబర్‌పేట మీదుగా అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రోహిణ్ రెడ్డికి మద్దతుగా సినీ నిర్మాత బండ్ల గణేష్ ప్రచారం చేశారు.



ఆహోబిల మఠంలో ప్రమాణం చేస్తున్న రోహిణ్ రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.